వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, జనవరి 23 : వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడొద్దని అందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. మంగళశారం మిషన్ భగీరథ అధికారులతో మున్సిపల్, గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరాపై అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథకు సంబంధించిన సమస్యలు జిల్లా వ్యాప్తంగా 22 చోట్ల ఉండగా వాటిలో 14 పనులను ఫిబ్రవరి 15 నాటికి మిగిలిన 8 చోట్ల ఫిబ్రవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ సీఈ చెన్నారెడ్డి, జడ్పీ సీఈఓ సురేశ్, ఈఈలు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, డీపీఓ యాదయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

హుజూర్‌నగర్ రూరల్, జనవరి 23 : హుజూర్‌నగర్ మండలాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి తీర్మానం చేశారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ లావణ్య, ఎంపీటీసీ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు జేవీవీ కృషి

- ఎంపీపీ ప్రశాంతి

జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రశాంతి

చిలుకూరు, జనవరి 23 : సమాజంలోని రుగ్మతలు, మూఢ నమ్మకాలను రూపుమాపడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నారిగూడెంలో జేవీవీ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 27న చిలుకూరు జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జాఫర్, హెచ్ఎంలు జనార్దన్, సురేశ్ పాల్గొన్నారు.

కేంద్రానికి వ్యతిరేకంగా 26న ట్రాక్టర్ల ర్యాలీ

- విజయవంతం చేయాలని ఎస్‌కేఎం నాయకుల విన్నపం

బొడ్రాయిబజార్, జనవరి 23 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్‌కేఎం పిలుపులో భాగంగా ఈ నెల 26న సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.డేవిడ్‌కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి పేర్ల నాగయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంవీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌కేఎం జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. 26న జిల్లా కేంద్రంలో ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లు, ఆటోల ర్యాలీని జనగామ క్రాస్‌రోడ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి, రైతు కూలి సంఘం నాయకులు కునుకుంట్ల సైదులు, షేక్ సయ్యద్, కోడి ఎల్లయ్య, మున్న లింగయ్య పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

హుజూర్‌నగర్, జనవరి 23 : హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావుపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. అవిశ్వాస తీర్మానంపై నేడు ఓటింగ్ జరుగనుంది. 2020లో హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 20 వార్డులను బీఆర్ఎస్ పార్టీ, 7 వార్డులను కాంగ్రెస్ పార్టీ, ఒక వార్డులో సీపీఎం కౌన్సిలర్ గెలుపొందారు. బీఆర్ఎస్‌కు పూర్తిస్థాయిలో మెజార్టీ ఉండడంతో చైర్‌పర్సన్‌గా గెల్లి అర్చనారవి, వైస్ చైర్మన్‌గా జక్కుల నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనారవి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు మరో 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీపీఎం కౌన్సిలర్ సైతం కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంతో ప్రస్తుతం ఆ పార్టీ బలం 22కు చేరింది. దాంతో కాంగ్రెస్ పార్టీ పావులు కదిపి.. ప్రస్తుత వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానాకి తెరలేపింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావుపై అవిశ్వాసానికి ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. బుధవారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు ప్రస్తుతం క్యాంప్‌లో ఉండగా బుధవారం నేరుగా అవిశ్వాస సమయానికి హాజరు కానున్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న నర్సయ్య

అడ్డగూడూరు వాసికి డాక్టరేట్

అడ్డగూడూరు, జనవరి 23 : అధిక వర్షాలతో వచ్చే చిన్న చిన్న భూకంపాలపై చేసిన పరిశోధనాలకు గానూ మండలంలోని డి.రేపాక గ్రామానికి చెందిన బండాని నరేశ్ ఉస్మానియా యూనివర్సిటీ భూగర్భశాస్త్ర విభాగం నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన నరేశ్‌ను డాక్టర్ నగేశ్, చీఫ్ సైంటిస్ట్ ప్రకాకుకుమార్ అభినందించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

ఆత్మకూరు(ఎం), జనవరి 23 : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎస్ఐ నాగరాజు అన్నారు. మండలంలోని పుల్లాయిగూడెంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన తడిసిన మల్లారెడ్డి సహకారంతో పొన్నగాని రవీందర్‌గౌడ్ స్మారకార్థం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం ఎస్ఐ నాగరాజు బహుమతులు అందజేశారు. సర్పంచ్ గిరిజ, ఉప సర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ

ఆత్మకూరు(ఎం), జనవరి 24 : టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ సమావేశం మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దర్శనం వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా జూకంటి కరుణాకర్, ఉపాధ్యక్షులుగా అనిత, సోమయ్య, కోశాధికారిగా రవి, కార్యదర్శులుగా ఎల్లయ్య, సునీత, కోటేశ్, స్వరూప ఎన్నికయ్యారు.

రాయిపల్లిలో పశువైద్య శిబిరం

ఆత్మకూరు(ఎం), జనవరి 23 : పశుగణాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులంతా వినియోగించుకోవాలని మండల పశు వైద్యాధికారి వల్లాల సంతోష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని రాయిపల్లిలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ కోసం ఉచిత పరీక్షలు చేసి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల సుమతి, పాల సంఘం చైర్మన్ ఇందిరమ్మ, ఎంపీటీసీ సత్యనారాయణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతి

అర్వపల్లి : నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రేణుక

బొడ్రాయిబజార్, జనవరి 23 : స్వాతంత్ర్య సమరయోధుడు, అజాద్ హిందూ ఫౌజ్ అధినేత, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ జయంతిని మంగళవారం సూర్యాపేట పూర్వ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్, గౌరవ సలహాదారు వై.నర్సయ్య, సహాయ కార్యదర్శి షేక్ సైదులు, సభ్యులు షేక్ మదీనాబి, చొల్లేటి ఉపేంద్ర చారి, గౌరిశెట్టి అప్పారావ్, షేక్ నజీర్‌పాషా, వెంకటేశం, మహ్మద్ ముజీబ్, దాసరి సత్యనారాయణ, రాంరెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యాదవ్ నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎపీఎం మల్లేశ్, ఈసీ నాగేశ్, కార్యదర్శి నాగయ్య, కంప్యూటర్ ఆపరేటర్ సంతోషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బట్టు మధు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో స్ఫూర్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతు కరుణాకర్, అణగారిన కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాంసైదులు, చామకూరి అంజి, భాగ్యారావు, బాల సైదులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్ : పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో సుభాశ్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, జిల్లా కార్యదర్శి విద్యాసాగర్ రావు, వెంకటేశ్వర్‌రావు, యర్రంశెట్టి లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

మేళ్లచెర్వు, జనవరి 23 : మండలంలోని హేమ్లాతండా క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడగా ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. కోదాడ మండలం సాలార్జంగ్‌పేటకు చెందిన కూలీలు మిరపకాయలు ఏరేందుకు చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి ఆటోలో బయల్దేరారు. హేమ్లాతండా క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో కూలీల ఆటో రోడ్డు ప్రక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివ, నరసింహ,లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జనవరి 23 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

గ్రాహం స్టెయిన్ సేవలు మరువలేనివి

- జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్

గ్రాహం స్టెయిన్ ఫ్లెక్సీ వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా పాస్టర్లు

బొడ్రాయిబజార్, జనవరి 23 : క్రిస్టియన్ మిషనరీ గ్రాహం స్టెయిన్ భారత దేశానికి అందించిన సేవలు మరువలేనివని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. 1999 జనవరి 23న మతోన్మాదుల చేతుల్లో సజీవ దహనానికి గురైన గ్రాహం స్టెయిన్, ఆయన ఇద్దరు కుమారులు ఫిలిప్, తిమోతిల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాల వద్ద మంగళవారం స్థానిక మన్నాచర్చిలో ఘన నివాళులర్పించి మాట్లాడారు. స్టెయిన్ కుష్ఠు వ్యాధిగ్రస్తులకు విశేష సేవలు అందించినట్లు తెలిపారు. స్టెయిన్ భార్య తన భర్త సేవలను కొనసాగిస్తున్నందున 2005లో భారత ప్రభుత్వ పద్మశ్రీ ఇచ్చి గౌరవించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బిషప్ సీహెచ్.సాల్మన్‌రాజు, గౌరవ సలహాదారులు డాక్టర్ పి.మార్క్, డాక్టర్ ఎం.హాజర్య, డాక్టర్ ఆర్.రూబెన్, నియోజకవర్గ అధ్యక్షుడు ఏలియారాజు, టౌన్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లు జాన్‌పాల్, పట్టణ ట్రెజరర్ ఆర్.స్పర్జన్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఫిలిప్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్ఐ కృష్ణమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ కృష్ణమూర్తి

మునగాల, జనవరి 23 : విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిఈశ్వరీగౌడ్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్

చివ్వెంల, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదువుపై మక్కువ చూపించి జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్ మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 537 మందికి స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దేవరకొండ జనార్దన్, రాచకొండ ప్రభాకర్, మహేశ్, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

మాచిరెడ్డిపల్లిలో చీరెలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రేమలతావెంకట్‌రెడ్డి

చీరెలు పంపిణీ

నాగారం, జనవరి 23 : మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పసుపులేటి ప్రేమలతావెంకట్‌రెడ్డి ఈ నెలాఖరుతో తన పదవీకాలం ముగుస్తుండడంతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు, వీబీకేలకు రూ.15 వేల విలువైన చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అలీసా, సంధ్య, పద్మ, రాణి పాల్గొన్నారు.

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల చైర్మన్ చంద్రశేఖర్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

సూర్యాపేట రూరల్, జనవరి 23 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతో దోహద పడుతాయని శాస్త్ర పాఠశాల చైర్మన్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని రాయిన్‌గూడెం గ్రామ సమీపంలో గల శాస్త్ర పాఠశాలలో క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

తుంగతుర్తి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా సంతోశ్

తుంగతుర్తి, జనవరి 23 : తుంగతుర్తి మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా కొల్లోజు సంతోశ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తంగళ్లపల్లి మధు సత్యనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీరామోజీ సతీశ్ సమక్షంలో సంతోశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

మఠంపల్లి, జనవరి 23 : మఠంపల్లి సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపీడీఓ జానకీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మఠంపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచ్‌కు గతంలోనే నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై సర్పంచ్ వివరణ సంతృప్తిగా లేదని, నిధులు రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావ్ తాసీల్దార్‌ను ఆదేశించారని, దాంతో పాటు చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేసి ఎంపీడీఓకు ఇచ్చినట్లు తెలిపారు. ఉప సర్పంచ్ జాల కిరణ్‌కు రెండో సంతకం అధికారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

శివాలయ చైర్మన్ పదవికి వెంకట్‌రెడ్డి రాజీనామా

మేళ్లచెర్వు, జనవరి 23 : స్థానిక స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ వర్రా వెంకట్‌రెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డికి ఆయన రాజీనామా పత్రాన్ని అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చౌటుప్పల్, జనవరి 23 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రాంనగర్, విద్యానగర్, కృష్ణానగర్, వినాయకనగర్, బీసీ కాలనీలో బుధవారం ఉదయం 12 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజుల సతీశ్ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బీబీనగర్, జనవరి 23 : మండలంలోని కొండమడుగు మెట్టు వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి(60)సరైన పోషణ లేక అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ యుగేంధర్‌గౌడ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662473, 8712662737 నంబర్లకు సమాచారం అందిచాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని తాసీల్దార్‌కు వినతి

గుండాల, జనవరి 23 : రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాసీల్దార్ జలకుమారికి సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రైతులు మాడ్యూల్ 33లో చేసుకున్న దరఖాస్తులు పరిష్కారం కాకుండా తీవ్ర జాప్యం జరుగుతుందని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. నవాబ్‌పేట రిజర్వాయర్ కింద కాల్వల నిర్మాణానికి రైతులు రెండుసార్లు భూములు కోల్పోయారని, వాటిని వెంటనే సవరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదులకు ఎస్పీ అభినందన

ప్రభుత్వ న్యాయవాదులను అభినందిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, జనవరి 23 : హత్య, లైంగిక దాడి కేసుల్లో దోషులకు కఠిన శిక్షలు పడేలా సమగ్ర దర్యాప్తు చేసిన పోలీస్ సిబ్బందిని, సమర్థ వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాదులను ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందించారు. పెన్‌పహాడ్, మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసుల్లో అలాగే మోతె పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితులకు కఠిన శిక్షలు విధిస్తూ న్యాయస్థానం ఇటీవల తీర్పు వెలువరించింది. దాంతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రభుత్వ న్యాయవాదులు కొంపెల్లి లింగయ్య, కాకి రాంరెడ్డిని, దర్యాప్తు పోలీస్ అధికారులను, కోర్టు డ్యూటీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా దర్యాప్తు, కోర్టు పోలీస్ విధులు సమన్వయం గుర్తించి చర్చించారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

చిలుకూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మునగాల, జనవరి 23 : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్ ప్రథమ, మోడల్ స్కూల్ విద్యార్థి గీత ద్వితీయ బహుమతి అందుకున్నారు. తెలుగు మీడియం విభాగంలో ముకుందాపురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన నాగచరణ్, విజయ్‌కుమార్ ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

చిలుకూరు : గణిత పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం కరుణాకర్ రెడ్డి బహుమతులు అందించారు. ఇంగ్లిష్ మీడియంలో చిలుకూరు జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ముక్కా చరణ్‌సాయిగౌడ్, పరిమళ, తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్ రామాపురానికి చెందిన వైష్ణవి, జడ్పీహెచ్ఎస్ ఆచార్యులగూడెం విద్యార్థిని రమ్య ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత పోటీ పరీక్షలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియం నుంచి మహేశ్‌బాబు అన్నారం ఉన్నత పాఠశాల, శ్రీరామ్ ఉన్నత పాఠశాల, ఇంగ్లీష్ మీడియం నుంచి దివ్య ఉన్నత పాఠశాల పెన్‌పహాడ్, ఆకాంక్ష ఉన్నత పాఠశాల పెన్‌పహాడ్, హర్షవర్ధన్, వంశిక విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ రవి తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

కోదాడ రూరల్, జనవరి 23: మండలంలోని చిమిర్యాల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై డైరెక్టర్లు మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చైర్మన్ ముత్తవరపు రమేశ్, వైస్ చైర్మన్ గడిపూడి పుష్పవతిపై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ తొమ్మిది మంది డైరెక్టర్లు గత నెలలో ఉన్న తాధికారులకు వినతిపత్రం అందించారు. దాంతో డీసీఓ ఎన్. శ్రీధర్ స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా చైర్మన్, వైస్ చైర్మన్ హాజరు కాలేదు. మిగిలిన 11 మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దాంతో ఆవిశ్వాసం నెగ్గినట్లు డీసీఓ తెలిపారు. బుధవారం కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు డీసీఓ నోటిఫికేషన్ జారీ చేశారు.

విద్యాభివృద్ధికి దివిస్ కృషి అభినందనీయం

- సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులకు మందులు అందజేస్తున్న సర్పంచ్

చౌటుప్పల్, జనవరి 23 : విద్యాభివృద్ధికి దివిస్ పరిశ్రమ కృషి అభినందనీయమని సర్పంచ్ మునగాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరిశ్రమ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతేకాకుండా స్కూల్ బ్యాగులు, పాదరక్షలు అందజేశారు. కార్యక్రమంలో జయంత్‌కుమార్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, అనిల్‌రెడ్డి, వేణుగోపాల్, దశరథ, వెంకటరాజు, సాయికృ